ఇస్తుంది. కాని సందేహం బలం ఇవ్వదు. భగవంతుడిమీద నీకు విశ్వాసం ఉంటే నీకు ఆత్మవిశ్వాసం కలుగుతుంది. ఆత్మవిశ్వాసం లేనివాడు ఏదీ సాధించలేడు. దేవుడులేడు అని చెప్పేవారు నాస్తికులుకాదు, వారి మీద వారికి నమ్మకం లేనివారు నాస్తికులు అని స్వామిజీ చెప్పారు. మన మీద మనకు విశ్వాసం లేకపోతే జీవితంలో ఏదీ సాధించలేము. నాస్నేహితులు చాలామంది ఉన్నారు. మమ్మల్ని బట్టే నాన్నగారికి జ్ఞానం వచ్చింది అని చెప్పేవారు కొంతమంది ఉన్నారు. నాన్నగారి దగ్గర మనం నేర్చుకొన్నాము అనేది వదిలేసారు, మేమే నాన్నగారికి జ్ఞానం ఇచ్చాము అని చెప్పేవారుకూడా ఉన్నారు. చివరకు విద్య అక్కడవరకు వచ్చింది. అలా అనుకోవటం వలన మనకు వచ్చే నష్టం ఏమీలేదు. ఆత్మ పెరిగేదికాదు, తరిగేదికాదు. సముద్రంలోనికి నదులు వెళ్ళికలవటం వలన దానికి వచ్చిన లాభంలేదు, నదులు వెళ్ళి కలవటం మానివేయటంవలన దానికి వచ్చిన నష్టం లేదు. దానివలన సముద్రం యొక్కలోతు ఏమీ తగ్గిపోదు. సముద్రం సముద్రమే జ్ఞానం జ్ఞానమే. ఉన్నది ఒక్కటే అసలు రెండు అనేది లేదు. ఒకటే నీకు అనేకంగా కనిపిస్తోంది అది ఒకలీల, అది ఒకమాయ అంతేగాని ఉన్నది ఒక్కటే. జ్ఞాని తనను అందరిలోను చూసుకొంటాడు, అందరినీ తనలో చూసుకొంటాడు. అలా ఎవడైతే చూసుకొంటున్నాడో వాడే జ్ఞాని. జ్ఞానికి స్వపరబేధంలేదు. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు కాని ఆనమ్మకం మనకులేదు. చెట్లను, పుట్లను పట్టుకొని తిరుగుతున్నాము, ఎక్కడరాయి కనిపిస్తే ఆరాయి మీద పడుతున్నాము. అంటే రాళ్ళకు మొక్కకూడదనికాదు. ఆరాయిలో దేవుడు ఉన్నాడు అనేటంత నమ్మకం మన హృదయంలో ఉన్న దేవుడిమీద మనకు కలగటంలేదు. లోచూపు లేకపోవటంవలన ఆ నమ్మకం నీకు కలగటంలేదు. అనేకజన్మలనుండి మనకు బాహ్యచూపు అలవాటు అయిపోయింది, ఆచూపును లోపలకు త్రిప్పాలి, లోచూపు లేకుండా నీ హృదయంలో ఉన్న సౌందర్యం తెలియదు. నీ హృదయంలో ఉన్న ఆనందం నీకు తెలిస్తేగాని అసలు హృదయం వైపుకు ఆకర్షణ కలుగదు. కొంచెం ముల్లంత, రవ్వంత మనస్సును లోపలకు త్రిప్పితే లోపల ఉన్న పరమేశ్వరుడు మన మనస్సును పట్టుకొని లోపలకు లాగేసుకొంటాడు, మనం లోపలకు ఒక్క అడుగువెళితే, మిగతా 99 అడుగులు ఆయనే గుంజేసుకొంటాడు. నీ జీవితాన్ని సరిదిద్దుకొని, నీబుద్ధిని సరిదిద్దుకొని, లోచూపు నేర్చుకొని, నీహృదయంలోఉన్న వస్తువును సాక్షాత్కరింపజేసుకొంటే అప్పడు అదే అంతటా ఉంది అనే అనుభవం నీకు వస్తుంది. కాని నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు తెలియకుండా బయట ఏదో ఉంది అని అనుకొంటే ఆరోజుకారోజు నీకు బాహ్యచూపు అలవాటు అయిపోతుంది కానిలోచూపు నీకురాదు. ఇవాళ మన సబ్జక్టు ఏమిటి అంటే హృదయంలో ఉన్నవాడిని వదిలేసాము, ఎక్కడెక్కడో ఉన్నాడని తిరుగుతున్నాము. సరే తిరగండి కాని హృదయంలో ఉన్నవాడిని కూడా గుర్తించండి.

**5-12-2003**



## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 18-11-03, జువ్వలపాలెం

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

శరీరానికి కంపర్టు అవసరం, మనస్సుకు కంట్రోలు అవసరం ఈ రెండింటికి యోగాభ్యాసాలు కొంతవరకు సహకరిస్తాయి, అంతమాత్రం చేతనే మనస్సు నశించదు. మనోనాశనం కలగకుండా జ్ఞానోదయం కలుగదు. ధర్మాన్ని ఆచరించకుండా ఎవరికి ఆత్మజ్ఞానం కలగదు. స్వార్థపరుడికి ఆత్మజ్ఞానం కలిగే అవకాశంలేదు. భగవంతుడు ఏపని అయితే మనకు అప్పగించాడో ఆపనిని శ్రద్ధగా, జాగ్రత్తగా చెయ్యాలికాని పని విడిచిపెట్టి పారిపోయే బుద్ధి పనికిరాదు. పనియందు గౌరవం పెంచుకోవాలి, పనిమానివేస్తే ఆత్మజ్ఞానం కలుగదు. మీరు జపం చేసుకోవచ్చు, ధ్యానం చేసుకోవచ్చు, కాని జపం పేరుమీద, ధ్యానం పేరుమీద మీరు ఇంటి దగ్గర చేసే పనుల దగ్గర అశ్రద్ధగా ఉండకూడదు. పని మనలను విడిచిపెట్టాలిగాని మనం పనిని విడిచిపెట్టకూడదు అని రామకృష్ణుడు చెప్పారు. మనం పనిని విడిచిపెడితే ఆపనిని వడ్డీతో సహా వచ్చే జన్మలో భగవంతుడు మన చేతచేయిస్తాడు. మనం మంచికర్మ చేసిన, చెడుకర్మ చేసిన దానిని భగవంతుడు మనకు అనుభవంలోనికి తీసుకొనివస్తాడు. పుణ్యఫలం సుఖరూపంలో, పాపఫలం దుఃఖరూపంలో వస్తుంది. అదీ ఖర్చు అయిపోతుంది, ఇది ఖర్చు అయిపోతుంది. రెండూ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. మనశరీరంకూడా కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. వచ్చింది ఏదైనాసరే పోతుంది, ఎప్పడూ ఉండేది ఏదో ఉంటుంది. ప్రపంచాన్ని మనస్సు చూస్తోంది. చూడబడేది ప్రపంచం, చూచేవాడు జీవుడు, చూచుట ఈమూడింటిలోనుండి విడుదల పొందకపోతే కోటిజన్మలు ఎత్తినా దుఃఖం మనలను విడిచిపెట్టదు. ఈ త్రిపుటిలో సుఖంలేదు, శాంతిలేదు, ఆనందంలేదు. ఈ త్రిపుటిని ఓవర్‌కమ్ చేస్తేగాని మనకు బ్రహ్మానుభవం కలుగదు. అది మాటలకు, మనస్సుకు అందదు, అది అనుభవైకవేద్యం. బ్రహ్మానుభవం పొందటంకోసం కామక్రోధముల యొక్కవేగం, రాగద్వేషములయొక్క వేగం తగ్గించుకోవాలి. ఈశరీరం మరణించాక కాదు, ఈశరీరం ఉండగానే రాగద్వేషముల యొక్క వేగం తగ్గించుకోవాలి. లోపలఉన్న భగవంతుడికి ఇష్టంలేదు అయిష్టంలేదు, రాగంలేదు ద్వేషంలేదు వాడు సమానంగా ఉంటాడు, వాడులోపల ఉంటాడు, బయట ఉంటాడు, అంతటా ఉంటాడు. నువ్వుకూడా అలాగ ఉండగలిగితే ఆయన స్వరూపాన్ని పొందుతావు. నేను ఇలా ఉండాలి, నేను అలా ఉండాలి అనుకోవటం పిరికివాడి లక్షణం సమాజాన్ని అనుకరించేవాడికి ఎవడికీ జ్ఞానం కలుగదు. భగవంతుడు ఎలా జీవించమని చెప్పాడో అలా జీవించేవాడికి భగవంతుడు స్వరూపంగా వ్యక్తమవుతాడు. అంతేగాని పదిమంది అలా ఉన్నారు నేను కూడా అలా

ఉంటాను అంటే దానివలన ప్రయోజనంలేదు. శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకో. ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా, శాస్త్రం యొక్క అనుగ్రహం లేకుండా శాస్త్రంలో ప్రతిపాదించబడినటువంటి బ్రహ్మపదార్థం తెలియబడదు. మనకు అన్ని కంఫర్ట్సు ఉన్నాయి అనుకోండి, శాంతిలేదు అనుకోండి ఏమిసుఖపడతాము. శాంతి లేనివాడికి సుఖంలేదు అన్నాడు త్యాగరాజు. శాంతి ఎక్కడుంది? శాంతి మన హృదయంలోనే ఉంది. భగవంతుడు ఎక్కడయితే నివాసంగా ఉన్నాడో అక్కడే శాంతి ఉంది. అసత్యములోపలే సత్యం ఉంది. ఏది అసత్యం? మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అది అసత్యం, దానిమూలంలోనే సత్యం ఉంది. మీకు ఎవరికైనా దుఃఖం వస్తూ ఉంటే లోపల కోరిక ఉండి ఉండాలి. కోరికలేనివాడికి దుఃఖంలేదు. కోరిక ఉన్నవాడికి దుఃఖం వస్తుంది, పునర్జన్మలు వస్తాయి. కోరికలేనివాడికి దుఃఖం లేకపోవటమేకాదు, ఈసృష్టేలేదు అని ఒక ఉపనిషత్ చెప్పింది. ఏరకమైన కోరిక నాకు లేనప్పుడు ఈ ప్రపంచంతో నాకు పనిలేదు.

మేము ప్రారబ్దం అనుభవిస్తున్నాము, మా దేహప్రారబ్దం ఇలా ఉంది అని చాలామంది అంటూ ఉంటారు. రామకృష్ణ పరమహంస గారికి కేన్సర్ వచ్చింది, భగవాన్‌కి కేన్సర్ వచ్చింది, మహాత్ములకు కూడా వారి దేహాలు ప్రారబ్దం అనుభవించినట్లు మనకు చరిత్రలో కనిపిస్తోంది. ప్రారబ్దం లేకపోతే అసలు దేహమేరాదు. అజ్ఞాని దేహం ప్రారబ్దం అనుభవిస్తోంది, జ్ఞాని దేహం కూడా ప్రారబ్దం అనుభవిస్తోంది కాని జ్ఞాని సుఖపడుతున్నాడు, అజ్ఞాని దుఃఖపడుతున్నాడు దీనికి కారణం ఏమిటి? ఈప్రారబ్దం నిజమని అజ్ఞాని అనుకొంటున్నాడు అందులోనుండి దుఃఖం వస్తోంది. ఇది నిజంకాదు అని జ్ఞానికి స్పష్టంగా తెలుసు, అదే ఇద్దరికి తేడా. దేహప్రారబ్దం కూడా స్వప్నమే, అది సత్యంకాదు అని జ్ఞానికి అనుభవంలో ఉంటుంది కాబట్టి ఆయన సుఖంగా ఉంటాడు. మీకు జ్ఞానోదయం కలిగితే ప్రపంచంలో ఎవరికీలేని కష్టాలు మీకు వచ్చినా మీకు ఏమీ అనిపించదు, సింహాసనం మీద కూర్చొన్నట్లుగా ఉంటుంది. ప్రారబ్దం సత్యం అనుకొంటే దుఃఖం, ప్రారబ్దం అసత్యం అనుకొంటే ఇప్పడే ఈక్షణంలోనే మీరు సుఖి అవుతారు. మీరు యోగాభ్యాసాలు చెయ్యండి, ప్రాణాయామంచెయ్యండి, పూజలు చెయ్యండి, జపాలు చేయండి, ధ్యానాలు చేయండి అన్నీ చెయ్యండి, మీకు ఎలా బాగుంటే అలా చేసుకోండి కాని మనస్సును మాత్రం అందులో ఇన్వాల్ చెయ్యండి. ఆత్మజ్ఞానాన్ని సముపార్జించాలి అనేబుద్ధి మీకు నిజంగా ఉంటే దానికి మీ మనస్సును ప్రిపేర్ చెయ్యండి. ఈలోకంలో ఏదైనా సాధించాలంటే నీదేహము, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి నీకు సహకరించాలి. ఇవన్నీ సహకరిస్తేగాని పరము మాట అటుంచండి, ఇహము కూడా సాధించలేము. మనకు మన మనస్సు మీద ఉన్న నమ్మకం, ప్రపంచం మీద ఉన్న నమ్మకం, సమాజం మీద ఉన్న నమ్మకం హృదయంలో ఉన్న పరమాత్మమీద మనకు లేదు. కాని నమ్మకం ఉన్నట్లు మనస్సు నటిస్తోంది. నోటితో అహంకారం పోవాలను కొంటున్నాము, మనస్సులో ఉండాలనుకొంటున్నాము. ఈసృష్టిలోఏది ఆశించినా వాడు అహంభావన ఉండాలని కోరుకొంటున్నట్లే. ఈదేహము, పుణ్యం, గౌరవం, ధనం ఇవి అన్నీ అహంభావనకే. అహంభావన ఉంటే నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, ప్రపంచం ఉంది, పుణ్యలోకాలు ఉన్నాయి, పాపలోకాలు ఉన్నాయి, అన్నీ ఉన్నాయి అది లేకపోతే ఏదీలేదు. భగవంతుడికి నిజమైన పేరు ఉండటం, వాడే పురుషుడు. ఆపురుషుడు మనకు అనుభవంలోనికి వస్తే తరగని సుఖం, శాంతి మనం అనుభవిస్తాము. ప్రారబ్దం అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా కూడా సుఖాన్ని అనుభవిస్తాము. అప్పడు పరిస్థితుల ప్రభావం మీద వాడి సుఖం ఆధారపడి ఉండదు. మనకు భోగవాంఛలేదు అనుకోండి ఈదేహాన్ని ఏమి చేసుకొంటాము, మనకు దేహంతో పనిలేదు. భగవంతుడు నీకు ఏ అవకాశములు అయితే ఇచ్చాడో వాటిని సద్వినియోగం చేసుకొంటూ ఆత్మజ్ఞాన సముపార్జనకు ప్రయత్నం చేయాలి. సాధన చేసేటప్పడు మనం ఎంతవరకు అభివృద్ధి పొందుతున్నాము, మన చైతన్యస్థాయి ఎంతవరకు పెరుగుతోంది అని మనం కరెక్టుగా చెప్పలేము, లోపల అంతర్యామి అంచనా వేస్తూ ఉంటాడు. . మన మనస్సు ప్రిపేర్ అయినప్పడు జ్ఞానం ఇవ్వటానికి ఆయన ఒక్కక్షణం కూడా వెయిట్ చేయడు, వెంటనే నిన్ను జ్ఞానంతో అలంకరిస్తాడు. మనం మాట్లాడే మాటలవలన, మనం చేసే పనులవలన, మనకు వచ్చే తలంపుల వలన వ్యక్తిభావన పెరగకుండా చూసుకోవాలి. సాధనను కేవలం పూజగదికి పరిమితం చేయకూడదు. మనం మాట్లాడే మాట, మనం చేసేపని, మనకు వచ్చే తలంపులు జ్ఞానసముపార్జనకు సహకరించేలాగ మన జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి, ఇది అంతాసాధనే. ఎవరైనా చిన్నమాట అంటే భరించలేరు మీకు ఆత్మజ్ఞానం ఏమిటి? మీరు ఏదైనా అవమానాన్ని భరించగలిగితే అదికూడా సాధనలో ఒక భాగమే. శరీరంలో చెడుపదార్థం ఉన్నంతకాలం రోగం ఆమనిషిని పీడిస్తుంది అలాగే మనస్సులో చెడు ఉన్నంతకాలం వాడిని దుఃఖం వెంటాడుతుంది. ఎవడి మనస్సు వాడికే శిక్ష, కొంతమందికి సహజంగానే ప్రేమతత్వం ఉంటుంది, వారికి అసలు ద్వైతభావనే ఉండదు. పూర్వజన్మలో స్వార్థంలేకుండా ఎంతోకొంత సత్కర్మచేసి ఉంటేగాని ఈజన్మలో భక్తి కలుగదు. భక్తి అంటే అంత తేలికకాదు ధనం సంపాదించటం కంటే భక్తి సంపాదించటం కష్టం. భక్తిలేకపోతే జ్ఞానంలేదు. నువ్వు శారీరకంగా ఇబ్బందులు పడుతూ ఉంటే భగవంతుడిని ప్రార్థించవచ్చు, భగవంతుడు మనకు తండ్రిలాంటివాడు. మనకు ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి భగవంతుడిని ప్రార్థించటంవలన టెన్షన్ తగ్గుతుంది.

భగవంతుడిని నిరంతరం ప్రార్థించటం వలన వాడి జీవితం శాంతి పూరితం అవుతుంది.

నేను ఏదోసాధన చేస్తున్నాను కాని నామనస్సు బాహ్యమొఖానికి వెళుతోంది, దానికి లోచూపు కలగటం లేదు అని భగవాన్‌ను అడుగుతున్నారు. ఈలోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి, ఏదో ఒక ఆకర్షణ మనస్సును బాహ్యమొఖం చేస్తుంది. ఏ ఆకర్షణ వలన మన మనస్సు బాహ్యముఖానికి వెళుతోంది అని ముందు మనలోమనకి ఒక అంచనా ఉండాలి, పరిశీలన ఉండాలి. రోగం ఒకటి మందు వేరొకటి అయితే లాభంలేదు. మనమనస్సు ఏ విషయానికి ఆకర్షింపబడి బాహ్యముఖమవుతోందో జాగ్రత్తగా అర్థం చేసుకొని, అందులోని నిస్సారతను గుర్తించి, మన మనస్సును నెమ్మదిగా వెనుకకు తీసుకొనివచ్చి ఆత్మమీద లగ్నం చేయాలి. సారమంతా హృదయంలోనే ఉంది బయట ఏమీలేదు. తన్ను తాను మేనేజ్ చేసుకొన్నవాడే ఇతరులను బాగా మేనేజ్ చేయగలడు. ఇతరులను మేనేజ్ చేయటంకంటే సెల్ఫ్‌మేనేజ్‌మెంట్ గొప్పది. నన్ను నేను మేనేజ్ చేసుకోలేకపోతే. మిమ్మల్ని కూడా చెయ్యలేను. ఎన్నో దానధర్మాలు చేసిన వారికంటే, ఎన్నో గొప్పపనులు చేసిన వారికంటే వాడిని వాడు మేనేజ్ చేసుకొన్న వాడిద్వారా ఈసమాజానికి ఎక్కువ మేలు జరుగుతుంది. అందరూ ఉపనిషత్‌లు పారాయణం చేస్తున్నారు కాని ఇందులో ఆత్మానుభవం కలిగినవారు ఎంత మందిఉన్నారు? దానికి కారణం ఏమిటి అంటే పారాయణ చేస్తున్నారుగాని మీకు ఫౌండేషన్ లేదు. ఫౌండేషన్ లేకుండా, సత్కర్మ ఆచరించకుండా, మీడ్యూటీని మీరు శ్రద్ధగా చేయకుండా, మనస్సును రాగద్వేషాలతో నింపుకుని వాటిని పోగొట్టుకొనే ప్రయత్నం చేయకుండా, సాధనాబలం లేకుండా కేవలం ఉపనిషత్‌లు పారాయణ చేసినంత మాత్రాన వాడికి ఆత్మజ్ఞానం కలుగదు అని పరమాచార్యులవారు ఒకసారి చెప్పారు. భగవంతుడు నాలో అంతర్యామిగా ఉన్నాడు అనిచెప్పుతున్నారుకదా నాలో నిజంగా ఉంటే నాకు ఎందుకు తెలియటం లేదు అని అడుగుతున్నాడు. భగవాన్ ఏమిచెప్పారు అంటే నీకు ఉన్న అలవాట్లలో నుండి, బలహీనతలలో నుండి ముందు విడుదల పొందు, విడుదల పొందిన తర్వాత నీకు లోపలఉన్న వస్తువు ఎరుకలోనికి రాకపోతే అప్పుడు ప్రశ్నించు అంటున్నారు. జీవుడు మనలోనే ఉన్నాడు, దేవుడు మనలోనే ఉన్నాడు. జీవలక్షణాలు పోయిన వెంటనే వాడు ఆత్మస్వరూపాన్ని పొందుతాడు, వాడి మనస్సే ఆత్మాకారం చెందుతుంది మనంకాని దానిలోనుండి విడుదల పొందినప్పుడు మనం ఏదిగా ఉన్నామో అది ఎరుక లోనికి వస్తుంది. అసలు పరమాత్మ లోపల లేకపోతే వశిష్టుడికి అనుభవంలోనికి రాదు, రామకృష్ణుడికి అనుభవంలోనికి రాదు, ఆయన ఉన్నాడు కాబట్టే వాళ్ళకి అనుభవం లోనికి వచ్చాడు. మనోదేహములకు అతీతంగా, ప్రకృతివిషయాలకు అతీతంగా, జీవలక్షణాలకు అతీతంగా ఒక సత్యవస్తువు మనహృదయంలో ఉంది. ఉండటమేకాదు ఆవస్తువు నీవై ఉన్నావు. అది నీకు అనుభవంలో లేదు కాబట్టి అదిలేదు అనుకొంటున్నావు. నీకు బేధబుద్ధి ఉన్నప్పుడు, రాంగ్‌తింకింగ్ ఉన్నప్పుడు అది నీకు అనుభవంలోనికి రాదు. నీ అలవాట్లలోనుండి ఆకర్షణల లోనుండి విడుదల పొందితే అది నీకు అనుభవంలోకి వస్తుంది. మనలో ఉన్నవాసనే మనకు తలంపు రూపంలో వస్తుంది, మనలో లేనిది రాదు. ఆతలంపు వచ్చినపుడు నీవు దానిని సంతృప్తి పరుస్తావు. అలా సంతృప్తి పరచినపుడు అది మరింత బలపడి వాసనగా మరల హృదయంలో నిలబడి పోతుంది. జపధ్యానముల వలన ఏకాగ్రత, పవిత్రత, ప్రవీణత కలుగుతాయి, వీటి వలన నీమనస్సుకు లోచూపు కలుగుతుంది, లోచూపులేనివాడికి లోపల ఉన్న అందం తెలియదు, ఆత్మజ్ఞానం కలుగదు. అవతారపురుషులు వచ్చినప్పుడు వారిని అనుసరించిన వారు అందరూ బాగుపడతారని లేదు, వారియొక్క ఔన్నత్యాన్ని గుర్తించినవారు బాగుపడతారు. నీవు ఆత్మను చింతించగా చింతించగా, సజ్జన సాంగత్యం చేయగా చేయగా, శాస్త్రం పట్ల గౌరవం పెంచుకుని అధ్యయనం చేయగా చేయగా, భగవంతుని పాదాలను ఆశ్రయించి ఉండగా నిన్ను ఏ తలంపులు అయితే ఇబ్బంది పెడుతున్నాయో, పూర్వజన్మలనుండి నీవు వేటినయితే మోసుకుని వచ్చావో నీకు తెలియకుండా ఆరోజుకారోజు వాటికి దూరమైపోతూ ఉంటావు. మనం కానిదానిలోనుంచి విడుదల పొందితే గాని మనం ఏదైతే అవునో అది మనకు అనుభవంలోనికి రాదు. మనకు లోచూపు కలిగినపుడు, హృదయంలో ఉన్న శాంతి రవ్వంత మనకు రుచి తెలిసినపుడు అసలు మన జీవితవిధానమే మారిపోతుంది. ఒక ఆత్మజ్ఞాని ద్వారా ఈలోకానికి జరిగే ఉపయోగం ఎవరి ద్వారా జరుగదు అని చెప్పారు. వాడు ప్రవచనాలు చేయనక్కరలేదు, రచనలు చేయనక్కరలేదు, వాడు శరీరం ధరించి ఉంటే చాలు వాడి ద్వారా ఈసృష్టికి ఎంతో మేలు జరుగుతుంది. పూర్వం మన మహర్షులు భోధించకుండానే వారి మొఖాలుచూసి ఆత్మజ్ఞానం పొందిన వారున్నారు, అది జ్ఞాని యొక్క వైభవం. జ్ఞానంతో సమానమైన వస్తువు ఈలోకంలో గాని, పరలోకంలో గాని లేదు అంటే దానికి మించినది ఎలా ఉంటుంది, దానికి మించినది లేనే లేదు. మనకు ఇష్టమైన తలంపు వస్తే సంతోషం, అయిష్టమైన తలంపు వస్తే దుఃఖం వస్తుంది. ఇవి రెండూ అసత్యమే, ఇవి రెండూ కూడా నీస్వరూపం నుండి నిన్ను దూరం చేస్తాయి. దుఃఖం ఒక వికారం, సంతోషం ఒక వికారం. నిర్వికారస్థితిని పొందితేగాని నీవు జ్ఞానానికి ఫిట్ అవ్వవు, దానికి తయారు చేయటానికే ఈ జ్ఞానయజ్ఞాలు. లోపలఉన్న సద్వస్తువులో నుండి వచ్చిన సుఖం తప్పించి, దానిలో నుండి వచ్చిన శాంతి తప్పించి నీకు బాహ్యంగా దేనినుండి సంతోషం వచ్చినా అది పరిణామంలో

దుఃఖంగా మారిపోతుంది. నీవు దేనినైతే పోగొట్టుకోవాలనుకుంటున్నావో దానిని ముస్తాబు చేయకు, అప్పుడు దానంతట అదే చనిపోతుంది, నువ్వుఏదిగా ఉన్నావో అదినీకు వ్యక్తమవుతుంది. నేనును విచారణచేసి తొలగించుకొన్నాసరే లేకపోతే ఈ నేనును తీసుకొనివెళ్ళి భగవంతుని పాదాలకు అర్పించినాసరే. ఇది భక్తిమార్గం, అది జ్ఞానమార్గం. నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణంచెయ్యి. ఈ మిధ్యానేనులో నుండి, మూలతలంపులో నుండి విడుదల పొందటం ప్రధానం. నీపూర్వజన్మ సంస్కారమునుబట్టి నీమనస్సు ఏమార్గం చేత ఆకర్షింపబడుతుందో ఆమార్గంలో ప్రయాణంచేసి మిధ్యానేనులోనుండి విడుదల పొందు, అప్పుడు లోపల వస్తువు ఉందో లేదో నీకే తెలుస్తుంది. సాధనచేసేవాడికి యాక్షన్ ఎక్కువగా ఉంటుంది, రియాక్షన్ తక్కువగా ఉంటుంది. జ్ఞాని పనిచేయటం లేదు అని మనం అనుకొంటాము దీనికే భగవాన్ ఒకసారి చెప్పారు, బొంగరం చాలాస్పీడుగా తిరిగేటప్పుడు అది ఏమీ తిరగటంలేదు అని మనకు అనిపిస్తుంది ఎందుచేతనంటే దానిస్పీడును మనకళ్ళు అందుకోలేవు, జ్ఞానిద్వారా జరిగే పని అలా ఉంటుంది. కొంతమంది మనుషులు ఎంతో పనిచేస్తారు కాని నిర్మలంగా, నిశ్చలంగా, నిరాడంబరంగా చేస్తారు, వారు ఇక్కడ ఉన్నారనే జాడకూడా మనకు తెలియదు. వారుచేసే పని ఇతరులు గుర్తించాలని వారు అనుకోరు. వారిని ఆగ్రామం గుర్తించకపోవచ్చు, సమాజం గుర్తించకపోవచ్చు కాని భగవంతుడు వారిని గుర్తిస్తాడు, వారిని మోక్షంతో ఆత్మసామ్రాజ్యముతో అనుగ్రహిస్తాడు. మనం ఈశ్వరుని దయకుపాత్రులు అవ్వాలి. మనం ఏరకంగా పనిచేస్తే ఈశ్వరునిదయకు పాత్రులవుతామో ఆరకంగా పనిచేయటం నేర్చుకోవాలి. మనంలోకాన్ని అనుసరించకూడదు, శాస్త్రాన్ని అనుసరించాలి. శాస్త్రాన్ని అనుసరిస్తే జ్ఞానం, లోకాన్ని అనుసరిస్తే అజ్ఞానం. కర్మఫలాన్ని ఆశించకు అని భగవంతుడు చెప్పాడంటే కర్మఫలంరాదు అనికాదు, వస్తుంది. ఆశించకపోతే ఎక్కువ వస్తుంది పైగా పొల్యూట్ అవ్వదు. మనం కోరుకోకుండా వచ్చింది మనలనుబంధించదు, కోరుకొని తెచ్చుకున్నది బంధిస్తుంది. నీ దేహప్రారబ్దంలో ఉన్నది ఏదో అది జరుగుతుంది, దేహప్రారబ్దంలో లేనిది నీవు కోరుకొన్నారాదు. ఉన్నది పోదు లేనిదిరాదు. అనుకొనేది మన సంకల్పం, జరిగేది ఈశ్వర సంకల్పం. ఒకోసారి మన సంకల్పం, ఈశ్వర సంకల్పం కలుస్తాయి, అప్పుడు నేనే సాధించాను అనుకొంటావు. అప్పుడు కూడా నీవు ఏమీ సాధించలేదు, జరిగింది ఈశ్వరసంకల్పమే. మీరు ఏదైనా సాధన చేస్తూ ఉంటే అది మీ తెలివితేటలవలన అని అనుకోవద్దు. ఈశ్వరుని దయ చేయిస్తోంది అని అనుకోండి. అజ్ఞానం తొలగించుకోవాలి అనే తలంపు మీకు వస్తూ ఉంటే అది కూడా ఈశ్వరుని దయవలననే వస్తోంది కాని అది మీ తెలివి తేటలవలనకాదు అక్కడ కూడా





ఈశ్వరుడు ఉన్నాడు అని మర్చిపోవద్దు. మన దూడను తాడు విప్పేసారు అనుకోండి అది ప్రక్కపొలాలలోనికి వెళ్ళి మేసేస్తుంది. దొంగమేతకు అలవాటు పడుతుంది, అప్పుడు మీరుదానికి నెమ్మదిగా తెలగపిండి, తవుడు నీళ్ళు అలవాటు చేసారు అనుకోండి తరువాత మీరు తాడు విప్పినా అది దొంగమేతకు వెళ్ళదు. అలాగే మీ హృదయంలో ఉన్న శాంతి జీవుడికి కొంత తెలుస్తూ ఉంటే దానికి చాపల్యం తగ్గిపోతుంది. బయట ఎక్కడో సుఖం ఉందిఅని నీవు వెడుతున్నావు. అక్కడ సుఖం లేకపోయినా సుఖం ఉన్నట్లు నీకు కనబడుతోంది కాబట్టి బయట తిరుగుతున్నావు. నీ హృదయంలో ఉన్న సుఖం, శాంతి నీకు తెలుస్తున్నాయి అనుకో మనస్సు అప్పుడు సుఖంకోసం, శాంతి కోసం బయటకు వెళ్ళనే వెళ్ళదు, నీవు తోలినా వెళ్ళదు. మీ మనస్సును ఆగమంటున్నారు అది ఆగటంలేదు, నా మనస్సును కదలమంటున్నాను అది కదలటంలేదు అనేవారు భగవాన్. ఆర్ధికఇబ్బందుల కంటే, సమాజపరంగా వచ్చే ఇబ్బందులకంటే, గాలివానలు భూకంపాలు వలన వచ్చే ఇబ్బందుల కంటే వీటిఅన్నింటికంటే ఎవడి మనస్సు వాడిని ఎక్కువ దుఃఖపెడుతుంది. ఉపనిషత్‌లలో ఏమి చెప్పారు అంటే ఎవరికైనా ఏదైనా ఇచ్చేటప్పుడు నీ ఇంటికి వారిని పిలిచి ఇవ్వకు, నీవే వారి ఇంటికి వెళ్ళు, మర్యాదగా, వినయంగా ఇయ్యి. అది ఇచ్చేటప్పుడు మనస్సులో ఏమి అనుకోవాలి అంటే తీరా ఇస్తున్నాను వారు తీసుకొంటారో లేదో అని అనుమానంతో ఇయ్యి, నేను ఇస్తున్నాను అనే గర్వంతో ఇవ్వకు అనిచెప్పారు. ఆ మాటలను అర్ధం చేసుకొనే స్థాయి మనకులేక వాటిని మనం గుర్తించలేకపోతున్నాము. నువ్వు మొత్తం వెళ్ళి హృదయంలో పడిపోనక్కరలేదు రవ్వంత నీమొఖాన్ని హృదయంవైపుకు త్రిప్పు, అప్పుడు శాంతి, ఆనందం తుంపర్ల లాగ నీ మీద చిందుతుంది, అప్పుడు మనస్సు యొక్క వ్యాపకం తగ్గిపోతుంది. లోపల ఉన్నవాడు స్వతంత్రుడు, వాడు ఈసృష్టి ఉన్నా ఉంటాడు, సృష్టి లేకపోయినా వాడు ఉంటాడు. వాడు అంతటా వ్యాపించి ఉంటాడు. వాడు నీకోసం ఎదురుచూస్తున్నాడు. నీకు కొంచం లోచూపు కలిగితే, ఒక్క అడుగునీవు అటు వెళ్ళితేవాడు నీజుట్టుపట్టుకొని లోపలకు గుంజేసుకొని, వాడి స్వరూపాన్ని నీకు ఇస్తాడు అప్పుడు ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే. మనం విశ్వాసహీనులం. భగవంతుడు చెప్పిన ప్రతీమాట సత్యం అయినప్పటికి మనలో ఉన్నపాపం, దోషం ఆమాటలను నమ్మనివ్వదు. మనం అనుభవించవలసింది ఇంకా ఉన్నప్పుడు మన మనస్సు వాటిని అంగీకరించదు, ఆమాటలను డౌట్ చేస్తూ ఉంటుంది. భగవంతుడు సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు, ఆయనకు తెలియకుండా ఈసృష్టిలోఏమీ జరగటంలేదు. అందుచేత మీరు విశ్వాసం పెంచుకోండి. ఆయన చెప్పినట్లుగా మీ జీవితవిధానాన్ని సరిదిద్దుకొని, తరించండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 18-12-03 | గురు | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| 25-12-03 | గురు | కొవ్వాడ (వయా) కాకినాడ సాయిబాబా మందిరము |

# " క్షుద్రం- హృదయ దౌర్భల్యం"

శరీరం వచ్చింది కాబట్టి ఏదో ఒకటి జరక్కుండా ఎలా ఉంటుంది? అలా జరిగిన దుఃఖ సంఘటనకు కృంగిపోతే ఆసమస్యకు కుదురుతుందా? "ఉన్నదల్లా ఒక్కటి అంటే ఒక్కటే" అన్నారు భగవాన్. ఆస్థితి పొందలేక పోయినా ఆవిశ్వాసంతో జీవిస్తే ముందుకు వెడతాము. మనం ఇతరులతో పోల్చుకోవటం వల్లనే ముక్కలు ముక్కలుగా తయారౌతాము. మన పరిస్థితులకు తగ్గట్టుగా మనం జీవించాలి. జీవితయాత్రలో అనేక స్వభావాలు గలవారు ఎదురౌతారు. మనపై హుంకరిస్తారు, మనలను(ఆత్మను) ఏమీ చెయ్యలేరు. వారిని సరియైన అవగాహనతో పరిశీలిస్తే మన కర్మలనే ఆవేషాలు వేయించి ఈశ్వరుడు మన ముందుకు పెడతాడు అని గ్రహిస్తాము. అటువంటి సంకట పరిస్థితిలో ఓర్పు-మనోనిగ్రహం ఉంటే ప్రపంచంలో సాధించరానిది అంటూఏదీఉండదు. అలా కాకుండగా నాగతి ఏమిటి? నేను ఎలా బ్రతకాలి? అనే చింతాందోళనలతో జీవితాన్ని వ్యధామయం చేసుకోకూడదు. మనకు పశుపక్షాదులకున్న ఆత్మవిశ్వాసం ఉండాలి. భగవాన్ నిమిగ్నమైన జీవితం అశుభాన్ని పొందదు. భాధామయపరిస్థితుల్లోనే మహాత్ములు అందరూ జీవించారు అని గుర్తుంచుకోవాలి. భగవంతుని సాంగత్యంలో మనలను ఉంచగలిగి ఈకష్టం, ఆనందంప్రదమని భావించాలి. ఉపకారం పొందిన వారే గర్భశత్రువులుగా తయారైతే ఆకృతఘ్నతను తలుచుకుని కుమిలిపోకూడదు. " మీజీవితంలో ఏదైనా అపహాస్య సంఘటన జరిగితే దాన్ని అపహాస్యం చెయ్యి " అన్నారు షేక్సుపియర్. కారణం మన సుదీర్ఘ జీవుని యాత్రలో అది దుమ్ముతో కూడిన చిన్న ఎదురుగాలి. గమ్యాన్ని చేరితే అంతా నిర్మల ప్రశాంతసమస్థితే అక్కడ తొట్రు పాట్లు, తోపులాటలు ఉండవు, తోకతొక్కిన తాచుపాములా కాటేసేవారు తోక ముడిచి తొలగిపోతారు, బుద్ధుని జీవితమే దానికి ఉదాహరణ. నాకు ఒక రక్షకుడు ఉన్నాడనే విశ్వాసం ఉంటే దైన్యం దరిదాపుల్లోకి రాదు. " మాకేల విచారము? మముగన్న శ్రీ రామచంద్రా " అన్నారు త్యాగరాజు. " ఆత్మన్యూనత పనికి రాదు దానివల్ల ఏమీ సాధించలేము మీ ఆత్మవిశ్వాసం మీద విమర్శ రాకుండా జాగ్రత్తపడండి" అన్నారు శ్రీ నాన్న గారు. ఆ జాగ్రత్తతో జీవిస్తే శాంతే-శాంతి.

**సాగిరాజు రామకృష్ణంరాజు**
అర్ధవరం



**23-11-2003 తేది పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక సమారాధన సందర్భముగా**
**సద్గురు శ్రీనాన్నగారిచే** Dr. B.L.N. **రంగప్రసాద్‌రాజు** M.S. F.R.S.H **గారికి (భీమవరం)**
Best President, I.M.A. A.P. State - 2003 **అవార్డు వచ్చిన సందర్భమున సన్మాన కార్యక్రమం**



1996సం॥లో **సద్గురు శ్రీనాన్నగారి** ఆశీస్సులతో ప్రాతాళ్ళమెరకలో ప్రారంభించబడిన **కె.వి.కె.రాజు విద్యానికేతన్** (స్వర్గీయ కె.వి.కె.రాజు జ్ఞాపకార్థం ప్రారంభించబడిన సంస్థ) 7 సం॥లు పూర్తి చేసుకొని దినదినాభివృద్ధి చెందుతుంది. 28-11-2003 **"కె.వి.కె. రాజుగారి జయంతి"** సందర్భంగా సంస్థ ఆవరణలో **సద్గురు శ్రీనాన్నగారు** ఉదయం 10-36 ని॥లకు స్కూలు బ్లాక్ రెండవ అంతస్తుకు శంఖుస్థాపన చేసినారు. మధ్యాహ్నం 2 గంటలకు నాన్నగారి ప్రవచనం జరిగినది.

విజయలక్ష్మిమెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటి ఆధ్వర్యంలో 1996 లో Ist Class తో ప్రారంభించబడిన సంస్థ నేడు 7th Class వరకు వచ్చినది. ప్రతి సంవత్సరం సద్గురు శ్రీనాన్నగారు ఇదే రోజు (నవంబరు 28 th) **కె.వి.కె.రాజుగారి జయంతి** సందర్భంగా పవిత్ర హస్తాలతో సంస్థకు సంబంధించిన కార్యక్రమాలను ప్రారంభించటం జరుగుతోంది. ఇదే విధంగా నాన్నగారి ఆశీర్వాదంతో ఈ సంస్థను ముందు ముందు జూనియర్ కాలేజి స్థాయి వరకు తీసుకువెళ్ళాలని సొసైటి ఆశయం.